21079601

పుణ్యకర్మల చేత భువిని త్యాగము చేత
ప్రేమ తత్వములను పెంచవలయు
దాన తత్వము గాచి దైవ తత్వము పెంచి
నిత్యజీవితమును నెఱపు నరుడ!

విశాలమైన ఈ విశ్వమందు మానవుని మనస్సు సంకుచితముగా ఉండటము చాలా అవమానకరంగా ఉంటుంది. విశ్వస్వరూపుడు దైవము. అలాంటి దైవము ప్రతి వ్యక్తి యందు ఉండటం చేత ప్రతి మానవుని హృదయము అత్యంత విశాలమైనదిగా ఉండాలి. ఈనాడు మానవుడు దైవమును విస్మరించి భౌతికమును లౌకికమునే విశ్వసించి కాలము గడుపుటచే మనస్సు సంకుచితముగా మారిపోతున్నది. విశాలత్వమైన విష్ణుత్వమును చింతించిన తన మనస్సు విశాలంగా మారుతుంది. కనుక మొట్టమొదట మానవుడు తన హృదయాన్ని విశాలము గావించుకోవాలి. పవిత్రమైన ఆదర్శములను ఈనాడు మానవుడు సమాజములో చాటక సంకుచితమైన అల్పమైన ఆదర్శములను అందిస్తున్నాడు. మానవుని ప్రతి ఆదర్శము అత్యంత అద్భుతమైనదిగను పరిశుద్ధమైనదిగను విశాలమైనదిగను ఉండాలి. కనుకనే Life x infinity = GOD. Body x infinity = విరాట స్వరూపము. Mind x infinity = హిరణ్యగర్భుడు. మానవుడు తన అనంతమైన శక్తిని తాను గుర్తించలేక పోతున్నాడు. నిరంతరము తాను అనంతముగా భావించుకుంటూ తన జీవితము గడుపుతూ పోయినప్పుడు తన జీవితము అనంతమైన ఆదర్శమును సమాజమునకందిస్తుంది. ఈ అనంత శక్తి అన్నింటియందు ఉంటున్నది. దీనికి మూడు రకములైన ఉపమానములు. ఒకటి పారమార్థికము. రెండవది వ్యావహారికము. మూడవది ప్రాతిభాసికము.

పారమార్థికము, వ్యావహారికము, ప్రాతిభాసికము ఈ మూడు ప్రత్యేకమైనవి కావు. ఈ మూడింటియందున్న దివ్యత్వము ఒక్కటే. జలము లేక అలలు లేవు. అలలు లేక నురుగ పుట్టదు. ఈ నురుగ అలలను ఆధారం చేసుకుంటుంది. జలము, అలలు, నురుగు ఈ మూడింటియందున్న జలము ఒక్కటే. దీనినే త్రికూట స్వరూపము అన్నారు భగవంతుని. అనగా మూడింటియందు ఏకత్వము దైవత్వమే. పారమార్థికమే వ్యావహారికమందుండాలి. కాని ఈనాటి మానవుడు

వ్యావహారికమునకు పారమార్థికమునకు ఎట్టి సంబంధము లేదని భావిస్తాడు. ఆధ్యాత్మికమునకు లౌకికమునకు ఎట్టి సంబంధము లేదంటారు. ఇది చాలా పొరపాటు. ఆధ్యాత్మికము యొక్క ఆదర్శము, ఆధారము లేకుండా లౌకికము, వ్యావహారికము ఏమాత్రము ఉండుటకు వీలు లేదు. వ్యావహారికమందు కూడా పారమార్థికము అంతర్భూతమై ఉంటున్నది. కాన పారమార్థికము, వ్యావహారికము, ప్రాతిభాసికము ఈ మూడింటి యందున్న దివ్యత్వము ఒక్కటే అనే సత్యాన్ని నిరూపిస్తూ వచ్చింది వేదము.

తరతరముల నుండి భారత దేశము అన్ని దేశములకు ఆధ్యాత్మిక సంపత్తి చేత సుస్థిరమైన శాంతి భద్రతలను అందిస్తూ వస్తున్నది. కనుకనే నేటికిని 'లోకాస్సమస్తా సుఖినో భవంతు' అనే విశాలమైన భావము భారత దేశము చాటుతూ వచ్చింది. ఈ ఆదర్శము సుస్థిరము చేసే నిమిత్తమై ఆనాటి రాజులు, ఆనాటి ఋషులు, ఆనాటి మునులు, ఆనాటి పతివ్రతామ తల్లులు వీరందరు ఎంతో త్యాగము చేస్తూ వచ్చారు. ఇలాంటి ఆదర్శవంతమైన దానికి ఆనాడు అందరు ఏకమై అభివృద్ధికి తగిన ఏర్పాటు చేసే వారు. ఈనాడు ఏ ఒక్క విషయములో ప్రవేశించినా ఎవరికి వారే యమునా తీరే. ఏకమత్యమే కనిపించదు. ఈ ఏకమత్యము హృదయములో లేనప్పుడు అక్కడ enimity ప్రారంభమవుతుంది. ఈ enimity నీ హృదయములో ప్రవేశించకుండా చూచుకోవాలి. ఈనాడు unity లేదు. Divinity లేదు. అంతా కృత్రిమమైన మతముగా భావిస్తున్నారు. ఈ community అనే దాంట్లో జీవితము వ్యర్థము గావిస్తున్నారు. ప్రాచీన కాలము నుండి భారతదేశమందు ఇలాంటి సుసూక్తులు ప్రచార ప్రబోధలు సల్పి ఋషులు, మునులు, రాజులు ఈ విధముగా ఆధ్యాత్మిక శక్తిని కాపాడుతూ వచ్చారు. భారత దేశమందు ఆధ్యాత్మికమే నశిస్తే యావత్ప్రపంచమే నశిస్తుంది. అన్ని దేశములకు ఆధ్యాత్మికము మూలముగా ఉంటున్నది.

ఎట్టి మానవుడైనా పారమార్థికమునందు ప్రవేశించే తీరాలి. ఏ మానవునకైనా దాహము లేకుండా ఉండదు. ఈ కోరికలే మానవుని దాహము. దాహము తీరాలంటే కోరికలు తీరినా అతని దాహము తీరదు. మానవుని యొక్క పారమార్థిక కోరిక తీరాలంటే దైవచింత అత్యవసరము. పారమార్థిక జలమే దాహమును చల్లారుస్తుంది. ఈనాడు సమాజములో పారమార్థికము లేదు. నైతికము లేదు. ధార్మికము లేదు. కానీ పదవులు, ధనము ఈ రెండే వారి లక్ష్యము. ధనము సంపాయించవచ్చును. ఈ ధనము వారు ఏవిధముగా ఉపయోగించాలి. ఈ ధనము సద్వినియోగము చేయాలి. సద్వినియోగము చేయక పోవటం వలన సమాజములో అనేక అల్లకల్లోలములు

ప్రారంభమవుతున్నాయి. ప్రతి మానవుడు తన దివ్యత్వము తాను గుర్తించి పవిత్రమైన కర్మలలో పాల్గొనాలి. ఈనాడు దేనికి విలువ తగ్గిపోతున్నాది? బెండకాయ బీరకాయ విలువ ఎక్కిపోయింది. pine woodకి విలువ ఎక్కిపోయింది. అన్నింటికి విలువ అధికమై పోయింది. ఒక్కదాని యందు మాత్రమే విలువ తగ్గిపోయింది. మానవుని విలువ తగ్గిపోయింది. కారణము ఏమిటి? ఈ మానవతా విలువలు తనయందు లేక పోవటం చేత విలువ తగ్గిపోయింది. ఈ జగత్తులో పశుపక్షిమృగా క్రిములు, క్రిమి కీటకాదులు, ప్రతి పదార్థములు తమ తమ కర్తవ్యములను తాము నిర్వర్తిస్తూ తమ విలువలు తాము కాపాడుకుంటూ వస్తున్నాయి. కాని ఈనాడు తన విలువను తాను పాడుచేసుకోటం ఒక్క మానవుడు మాత్రమే. తన విలువ ఏమిటో తాను గుర్తించుకోలేకుండా ఉన్నాడు. మానవతా విలువలు అంటే ఏమిటి అని ప్రశ్నిస్తారు. మానవుని పుట్టుకతోనే ఈ విలువలు పుట్టాయి. అటువంటి దాన్ని మరచిపోయి కృత్రిమమైన నీడను పట్టుకున్నాడు. ఈనాడు మానవతా విలువలు అభివృద్ధి చేసుకున్న తరువాతనే తన విలువ గొప్పదిగా మారుతుంది.

సృష్టి అనగా ఏమిటి? ఈశ్వరేచ్ఛను ఒకవిధమైన ప్రతిరూపము ఈ సృష్టి. దీనినే ప్రకృతి అన్నారు. ఈ ప్రకృతి యొక్క దివ్యత్వము రక్షించే నిమిత్తమై మానవుడు ఉద్భవించాడు. తాను శరీర, మానసిక, ఆధ్యాత్మిక శక్తుల నన్నింటిని ఈ విలువలతో పంచి తద్వారా తాను తరించాలని మానవత్వములో ప్రవేశించాడు. మొట్టమొదట మానవుడు తన విలువలు తాను రక్షించుకోటానికి ప్రయత్నించాలి. మానవునకు ప్రేమ చాలా ప్రధానమైనది. మానవునకు కరుణ చాలా ప్రధానమైనది. కరుణ లేక మానవుడే కాదు. ప్రేమ లేక మానవుడే కాదు. సత్యము లేక మానవునికి ప్రాణమే లేదు. ధర్మమే లేక స్వరూపమే కాదు. కనుక అనాది కాలము నుండి వేదము సత్యం వద ధర్మం చర అని ప్రబోధిస్తూ వచ్చింది. ఈనాడు అశోక్ సింఘాల్ చెప్పాడు. అందరు శుద్ధమైన బ్రహ్మచారులని. ప్రశాంతి నిలయము మంతయు పరిశుద్ధమైన రీతిగా విలువైన రీతిగా ఉన్నదని. ఈ బ్రహ్మచర్యమంటే ఏమిటి? వివాహము చేసుకోకుండా ఉండటమా బ్రహ్మచర్యము. కాదు. కాదు. నిరంతరము బ్రహ్మలో చరించే మనస్సే బ్రహ్మచర్యమని. నిరంతరము సర్వకాల సర్వావస్థల యందు బ్రహ్మములో చరించాలి మనసు. బ్రహ్మములో చరించేవాడే బ్రహ్మచారి. ఇది పారమార్థిక సత్యము. అయితే వ్యావహారిక సత్యమందు కూడా దీనిని మనం అనుసరించాలి. మన నడతలు సక్రమమైనవిగా ఉండాలి. మన mannerలు చాలా పవిత్రమైనదిగా ఉండాలి. మన మాటలు చాలా విలువైనవిగా ఉండాలి. ఈ విధమైన సద్గుణములను పోషించుకున్నప్పుడే ఇతను వ్యావహారికమైన

బ్రహ్మచారి కాగలడు. భగవంతుడు ఒక్కడే తండ్రి. ఈ జగత్తునందున్న స్త్రీ పురుషులు అతని బిడ్డలే. కనుక ఈ విధమైన పవిత్రమైన భావము ఉండినప్పుడే ఇది వ్యవహారిక సత్యముగా రూపొందుతుంది. ప్రాతిభాసిక సత్యము ఎట్లా ఉంటుంది? పారమార్థికమందు, వ్యావహారికమందు, ప్రాతిభాసికమునందు జలము, చల్లదనము, తియ్యదనము ఈ మూడింటియందు ఉంటున్నవి. కనుక మానవుడు పారమార్థికమునందుగాని, వ్యావహారికమునందుగాని, ప్రాతిభాసికమునందుగాని తన గుణములను దైవత్వంగా మార్చుకోటానికి ప్రయత్నించాలి.

మనస్సునందు, చిత్తమందు, బుద్ధియందు, అహమునందు దివ్యమైన ఆత్మతత్వము ఉండినప్పుడే నిజమైన ప్రాకృతమైన మానవత్వము. ఈనాటి మానవునకు దయా దాక్షిణ్యమంటే ఏమిటో అర్థము కాదు. ఎదుటి వ్యక్తిని ఎంతైనా బాధపెట్టుటకు సిద్ధమవుతాడు గాని ఆ బాధను జూచి జాలి లేకుండా ఉంటున్నాది ఈ కఠిన హృదయమునకు. బాధ పడుతున్న వ్యక్తిని చూచి హృదయము కరగాలి. అదే నిజమైన కరుణ. అప్పుడే మానవుడని అనవచ్చు. mankind అన్నారు. kindness లేక mankind ఎట్లా అవుతుంది. మన హృదయమందు సర్వత్ర సర్వవేళలందు దయ నిండి ఉండాలి. అనాది కాలమునుండి భారత దేశములో ఇట్టి పవిత్ర సూత్రలను ప్రచార ప్రబోధలు సల్పుతూ వచ్చింది. అయితే ఇక్కడ దోషము ఏమిటి? ప్రచార ప్రబోధలు సల్పుతూ వచ్చారుగాని ఆచారమునందు లేకుండా పోయింది. ఆచరణలో వచ్చినప్పుడే ఆనందము ఆవిర్భవిస్తుంది. ఏ మానవుడు ఆచరణయందు ప్రవేశపెట్టటం లేదు. ప్రతి మానవుడు తాను చదివిన గ్రంథములు గాని లేక విన్న పవిత్ర విషయములు గాని తాను అనుభవించిన పవిత్ర విషయములు గాని ఆచరణలో పెట్టి దానిని పదిమందికి పంచటానికి పూనుకోవాలి. అవి లేకపోయినా ఏ ఒకటి రెండైనా ఆచరణలో పెట్టాలి. ఒక చిన్న ఉదాహరణము. విదేశములలో ఒక పడవ నడిపే వ్యక్తి తాను స్టీరింగు ముందర కూర్చున్నాడు. ఏదో అవసరం వచ్చి చిన్న కుమారుని పిలిచి 'బాబూ నాయనా నీవు ఇక్కడ కూర్చో నేను త్వరలో పోయి వస్తాను' అన్నాడు. ఆ అబ్బాయి పుట్టినప్పటి నుండి ఆ భాషలో నున్న రామాయణము చదువుకుంటూ వచ్చాడు. ఈ సత్యమును ఆ పిల్లవాడు గుర్తించుకున్నాడు. ఈ స్టీరింగు దగ్గర కూర్చున్నాడు. కర్మవశాత్తు పడవలో నిప్పు ప్రారంభమైంది. పడవలో నున్నవారు life boats వేసుకొని అటు ఇటు తిరుగుతున్నారు. ఎంతమందో వచ్చి ఆ పిల్లవాని బ్రతిమాలారు. 'నాయనా నీవు కూడా ప్రాణము రక్షించుకో' మన్నారు. 'నా ప్రాణము వదులుతానుగాని నా తండ్రి ఆజ్ఞ వదలను' అన్నాడు.

నా తండ్రి ఇక్కడ కూర్చోమన్నాడు. కాబట్టి దానిని నేను అనుసరిస్తున్నాను అన్నాడు. అట్లానే ఉన్నాడు. కాలి
పోయింది. అతనే కాసాబియాంకా. ఆ పిల్లవాని పేరు శాశ్వతమై నిల్చిపోయింది. ప్రతి మానవుడు అంతో
ఇంతో ఆచరణలో పెట్టినప్పుడు కదా మానవత్వము విలువ. కొంతవరకు పెరుగుతుంది. ఇది మంచి
దని తెలిసినా వారు ఏమాత్రము ఆచరణలో పెట్టరు. పదిమందికి చెబుతారు ఇది చాలా మంచిదని.
కానీ మంచిదని చెప్పినప్పుడు ఎందుకు ఆచరించకూడదు. చెప్పటం కేవలం కృత్రిమమైన మాటలే.
హృదయములో లేనప్పుడు మాటలలో ఎందుకు వస్తుంది. హృదయములో లేనిది మాటలలో చెప్పిం
చుకోటం అసత్యమైనది. మానవత్వమునకు విరుద్ధమైనది.

కనుక చెప్పినది చేయాలి. చేసినది చెప్పాలి. తలచినది చేయాలి. ఆవిధమైన
పరిస్థితి లేకపోవటం చేత ఈనాటి ప్రజలందు, ఆధ్యాత్మిక సంస్థలు ఎంత అభివృద్ధి అవుతున్నప్ప
టికి, అశాంతి ఏమాత్రము పోవటం లేదు. శాంతి ఎక్కడనుండి వస్తుంది మనకు? శాంతి తన
యందున్నది గాని బయట యందు కాదు. నీవు సక్రమమైన మార్గములో నడచినప్పుడు ఆ శాంతి
నీకు కనిపిస్తుంది. నీవు సత్యమైన మార్గము అవలంబించినప్పుడే నీకు శాంతి లభిస్తుంది. నీ
యందు భగవంతుని విశ్వాసము ఉంటే ఆ శాంతి నీయందు ప్రతిబింబిస్తుంది. కాని విశ్వాసము ఉండి
నట్లుగా నటిస్తున్నారు. అశాంతి ఉండటానికి కారణం ఏమిటి? విశ్వాసము లేకపోవటమే. ప్రతిఒక్కరు
మానవతా విలువలంటే సత్యధర్మశాంతిప్రేమలని చిలుక పలుకుల వలె పలుకుతున్నారు. ఒక్కరైనా
ఆచరణలో పెడుతున్నారా? ఏ ఒక్కటైనా ఆచరణలో పెడుతున్నారా? ఇంక ఇలాంటి వారికి ప్రచార
ప్రబోధలు చేసి ప్రయోజనం ఏమిటి? దీని వల్ల కేవలము సాయికి అపకీర్తి తెచ్చిన వారౌతారు. ఏ
ఒక్కటైనా ఆచరణలో పెడితే సాయికి ఆనందము. ఇది కష్టమైనది కాదు. సత్యము చెప్పటం సులభం.
ఉన్నది ఉన్నట్టు చెప్పటం ఎంత సులభము. నా చేతిలో handkerchief ఉందని సులభముగా చెప్ప
వచ్చు. ఈ hand kerchief చూపుతూ నా చేతిలో పుష్పమాల ఉన్నదంటే ఎంత అసత్యమవుతుంది.
సత్యము చెప్పటం ఎంత సులభము. అసత్యము చెప్పాలంటేనే కష్టము. ఇంత సులభమైన మార్గమును
మానవుడు ఈనాడు మరచిపోతున్నాడు. కష్టమైనదానినే ప్రేమించి అనుసరిస్తున్నాడు.

ఈనాటి మానవత్వములో ఇంత దైవత్వము ఉంటుండి కూడను ఇంత విశాలత్వము
ఉంటుండి కూడను ఇంత సంకుచిత మార్గములో జీవించటము చాలా ఆశ్చర్యము. హృదయ
మంటే ఈ పాంచభౌతికమైన గుండె కాదు. హృదయము సర్వత్రా ఉంటున్నది. మన దేహమును

అనంతముతో హెచ్చవేసినప్పుడు విరాటస్వరూపుడై పోతాడు. మైండును అనంతముతో హెచ్చవేసినప్పుడు భగవత్స్వరూపకముగా మారిపోతుంది. అతనినే హిరణ్యగర్భుడన్నారు. ఆత్మను అనంతములో హెచ్చవేసినప్పుడు బ్రహ్మ. బృహత్ సంబంధమైనది బ్రహ్మ. సర్వత్ర వ్యాపించినది. మనము Loveను expand చేయాలి. expansion of love is life. contraction of love is death. మనం expansion love పెట్టుకోవాలి. ఎందుకంటె దివ్యత్వమైన ప్రేమ ఉంటున్నాది. అది ఎప్పుడు వ్యాపించి పోతు ఉంటుంది. వ్యాపించిపోయే దివ్యమైన భావాలు మనలో ఆవిర్భవించాలి. కాని ఈనాటి మానవునకు ఇట్టి విశాల భావములు లేవు. అంతా సంకుచిత భావాలే. ఈ సంకుచితము పెట్టుకొని విశాలత్వము ఏవిధముగా అర్థమవుతుంది. మన యొక్క దివ్యత్వము అనంతమైనదిగా ఉంటున్నది. అందుకోసమే భగవంతుని అనంత రూపాయనమః అన్నారు. అనంతమైన జగత్తునందు అనంత రూపుడై ఉంటున్నాడు. జడ చైతన్యములందు తానే ఉంటున్నాడు. సర్వత్రా ఉండుటంచేత సర్వవ్యాపకుడై పోయాడు. సర్వవ్యాపకత్వమునకే బ్రహ్మ అని పేరు. అది కనిపించక పోవచ్చును. కనిపించవచ్చు. అది మన అదృష్టముపై ఆధారపడి ఉంటుంది. మీ మీ విశ్వాసములపై ఆధారపడి ఉంటుంది. నిజముగా మీరు ఆ విశ్వాసము దృఢముగా పెట్టుకుంటే తప్పక క్షణములోనే కనిపిస్తాడు. భగవంతుడు ఎక్కడనుండో దిగి రావటం లేదు. ఇక్కడనుండి ఎక్కడికో వెళ్ళిపోవటమనేది లేదు. భగవంతునిది రాకపోకలు లేని స్థితి. తాను రాడు తాను ఎక్కడికి పోడు. సర్వత్రా ఉంటున్నాడు. అయితే కొంతమందికి ఆ దివ్యత్వము నుండి ఆవిర్భవించిన శక్తి వల్ల దివ్యత్వమునే మరపింప చేస్తుంది. సూర్యుని వలన అనేక మేఘములు ఉద్భవిస్తాయి. ఈ మేఘములకు మూలకారణము సూర్యుడే. కాని సూర్యుని నుండి ఆవిర్భవించిన మేఘములు సూర్యునే మరుగు పరుస్తున్నాయి. ఇంత మాత్రము చేత సూర్యుడు కోపగిస్తాడా? కొంతసేపు ఓపిక పడితే మేఘములు కదలిపోతాయి. సూర్యుడు యథారీతిగా ప్రకాశిస్తాడు.

ప్రతి ఒక్కటి దైవము నుండి పుడుతున్నాయి. పుట్టటము, పెరగటము, లయము కావటము మూడింటికి దైవమే మూలకారణము. ప్రతి పదార్థమునందు దైవ సంబంధము ఏర్పడి ఉంది. ప్రతి విషయములో మనం దైవత్వం చింతించాలి. దైవము కోరేది రెండే రెండు సత్యము, ధర్మము. ఈ రెండింటి యందే ఎంతైనా ఉంటున్నాది. కరుణ, దయ, దాక్షిణ్యము

అందులోనే చేరి ఉంటున్నవి. ముఖ్యమైనవి రెండే మిగిలినవి ఇందులోని అంగములే. మనం దయలో ఉండాలి. ప్రేమకు పర్యాయ పదమే దయ. ప్రేమను దయ అంటారు. ప్రేమ మనలో ఉన్నప్పుడు ఏ ద్వేషము రాదు. అసలు మానవుని హింసిస్తున్నవి మూడే. కామ, క్రోధ లోభములే. కామము మనము చేసే కర్మమార్గమును భస్మము చేస్తున్నది. లోభము మన భక్తిని నశింపచేస్తున్నది. క్రోధము పూర్తి నశింపచేస్తున్నది. మానవునియందు ఈ కామ క్రోధ లోభములు ఉండటంచేత కర్మ ఉపాసన జ్ఞానము పూరి మంట కలిపి వేస్తున్నాయి. మానవునికి మంచి భావములు రాకుండా పోవటానికి ఇదే మూల కారణము. ఎందుకంటె కామ క్రోధ లోభములు మూడు ఉండటంచేత మంచి కర్మలు చేయలేక పోతున్నాం. దైవోపాసనలో పాల్గొనలేక పోతున్నాం. జ్ఞానమును సంరక్షించుకోలేక పోతున్నాం. అట్టి వాటిని మనం ఎందుకు ప్రవేశ పెట్టుకోవాలి. మనకు ద్రోహము చేసే వాటిని ఎందుకు పెంచుకోవాలి.? మొట్టమొదట మానవుడు ఈ మూడింటిని దూరము చెయ్యాలి. ప్రతి మానవునికి కొన్ని ఆశలుండాలి. మితిమీరి పోకూడదు మనము దుర్గుణములు దూరము చేసుకోటానికి దైవచింతన ఎక్కువ చేయాలి. ఈ విశాల ప్రపంచమందు విశాల హృదయులుగా ఉండాలి. సముద్రమంత హృదయముండాలి. విశ్వానికి సముద్రమే హృదయము. అందరియందు ఉన్నది మానస సరోవరము. అది కూడా గొప్ప విశాలమైనదిగా ఉండాలి. విశాల హృదయము లేనివాడు మానవుడే కాదు. సంకుచిత భావములను ఏమాత్రము అవకాశము ఇవ్వకూడదు. ఒకవేళ దోషములు కలుగవచ్చు. దానిని మనం లెక్క చేయకూడదు. ప్రేమను మాత్రం వదలుకోకూడదు. ప్రేమను ప్రధానంగా జీవితములో ఉంచుకున్నప్పుడు దేనినైనా మనం సాధించవచ్చు. మానవుడు విశాల హృదయుడు కావాలి. మానవుని యందు ఉద్భవించే సంకల్పము కూడా గొప్ప ఆదర్శవంతమైన సంకల్పముగా ఉంటుండాలి. అల్ప సంకల్పములను మనము ఏమాత్రము అభివృద్ధి చేసుకోకూడదు. అనంతమైన ఆదర్శములను తీసుకోవాలి. ఇట్టి ఆదర్శములు అవ్యక్తి పోయినా ఆదర్శము నిల్చి ఉంటుంది. మంచి ఆదర్శమునే చిరంజీవి అన్నారు. ఎప్పటికి నశించేది కాదు. దేహము నశించినా గుణము నశించేది కాదు. అట్టి పవిత్రమైన గుణములు మనము అభివృద్ధిగావించుకొనుటకు ప్రయత్నించాలి.

ప్రేమస్వరూపులారా! మీ అందరియందు ప్రేమ ఉన్నది. ఆ ప్రేమను పరిమితములో పెట్టుకుంటున్నారు. కాదు కాదు. విశాలము చేయాలి. ఆ ప్రేమను ఎంత విశాలము చేసుకుంటే

ఎంత పవిత్రముగా ఉంచుకుంటావో అంత నీ జీవితము ఆదర్శముగా ఉంటుంది. దైవ ప్రేమ అన్నింటి కంటె ముఖ్యమైన ప్రేమ. ప్రపంచములో శారీరకముగా వచ్చాము కనుక శారీరక ప్రేమలుంటాయి. తల్లి తండ్రి సోదరుడు, సోదరి అన్న శరీరముతో ఉద్భవించినవి. ఇవన్నీ మధ్యలో వచ్చి మధ్యలోనే పోతుంటాయి. ఇవన్నీ కదలి పోయే మేఘములు. దైవము నుండి వచ్చినది పెర్మనెంటు. ఆ ప్రేమను ఎంత అభివృద్ధి గావించుకుంటామో అంత అభివృద్ధి అవుతుంది. ప్రేమను అభివృద్ధి గావించుకోటం వలన మనకు లభించేది ఏమిటి? అదే ఆనందము. ప్రేమను ఎంత అభివృద్ధి చేస్తావో ఆనందము కూడా అంత అభివృద్ధి అవుతుంది. ప్రేమ ఎంత సంకుచితమవుతుందో నీ ఆనందము కూడా అంత సంకుచితముగా ఉంటుంది. నిరంతరము మనము ఆనందము అనుభవించాలనుకుంటే ప్రేమను పెంచుకోవాలి.

ప్రేమ రూపము బ్రహ్మంబు ప్రేమమయము
ప్రేమ ప్రేమతో సంధింప సమమగును
కాన ప్రేమను గట్టిగా కలిగియున్న
అద్వితీయము సాధింప అర్హుడగును.

అదే అద్వితీయము. ప్రేమను పెంచుకుంటే ఏకాత్మ భావమును విశ్వసించిన వారౌతావు. అదే సర్వత్ర ఉండినది. దీనిని మనం సాధించాలి. లోకసంబంధమైన విద్యలు నేర్చుకోవచ్చు. ఇవన్నీ అప్పటికప్పుడు లోకములో ఉపయోగించుకొనేవి. వ్యావహారిక విద్యలు ఇవి. పారమార్థిక విద్యలో ప్రేమ ప్రధానమైన ప్రాణము. ప్రేమను పెంచుకొండి. మనలో దయా ప్రేమలు అభివృద్ధి గావించుకున్నప్పుడే మనము పురుషోత్తములుగా మారతాము.